# షరీఫా

రాత్రి పదకొండు గంటలు అయింది.

చార్‌కమాన్ దగ్గిర మీర్‌ఆలం మండీకి వెళ్ళేదారిలో వుంది రంగా అడ్వొకేటు ఇల్లు. ఆ రోజు అతని ఇంట్లో పార్టీ. పాత స్నేహితులం పది మందిమి కూడాము. డ్రింక్సూ, ఆ తర్వాత భోజనం అయ్యే సరికి అంత రాత్రి అయింది.

మోతాదు కంటే కొంచెం ఎక్కువే పడ్డది నా కాకోజు. మత్తుగా వుంది. అందరూ వెళ్ళిపోయారు. నేనొక్కణ్ణే మిగిలాను. ఆ రాత్రికి అక్కడే పడుకోమన్నాడు రంగా. కాని రెండో రోజు ఆఫీసుకు పెంద రాలే వెళ్ళాల్సి వుందని చెప్పి, అక్కడికి అట్టే దూరంలేని మా ఇంటికి బయలుదేరాను.

వెన్నెల రాత్రి. చల్లగాలివీస్తూ, హాయిగా వుంది. మేన్‌రోడ్ మీది కెత్తే ఏదైనా రిక్షా చిక్కొచ్చని నడుస్తున్నాను.

ఇంతలో. "సాబ్!...సాబ్!" అన్న పిలుపు వినిపించింది. ఆగి, చూశాను.

గళ్ళలుంగీ, ఆఫ్‌ఆరం చొక్కా, మాసిన గెడ్డం, చెదిరిన జుత్తూ, బక్క చిక్కిన శరీరం, లోతుకు పోయినదవడ్డ, చెంపలూ... రిక్షావాడిలా ఉన్నాడు. నా వేపుకు వస్తున్నాడు.

అనుమానంగా చూస్తూ నిలుచున్నాను. దగ్గర కొచ్చి, "మిమ్మల్ని పిలుస్తున్నారు సాబ్!" అన్నాడు.

"ఎవరూ? . " అన్నాను అప్రయత్నంగా.

అటువేపు చూపించాడు. కొద్ది దూరంలో, గోడవారగా, ఒక రిక్షా నిలుచుని వుంది. పరదా వేసివుంది. అందులోంచి ఒక చెయ్యి బయటకొచ్చి నన్ను రమ్మన్నట్టు సౌంజ్ఞ చేస్తోంది.

"ఎవరూ?  " అని మళ్ళీ రిక్షావాడి కేసి చూశాను.

"వెళ్ళి చూడండి" అన్నాడు తల వంచుకుని.

కొంచం కొంచం అర్థమైంది. మెల్లిగా నడిచి రిక్షా దగ్గరకెళ్ళాను. పరదా తొలగించి చూశాను. నల్లని బురఖా వేసుకున్న ఒక స్త్రీకూచునివుంది. "రండి, కూచోండి" అంటూ తాను వొత్తిగిలి, ప్రక్కనే చోటు చూపింది.

నాకు పూర్తిగా అర్థమైపోయింది. అనిశ్చితంగా అలాగే నిలుచుండి పోయాను.

నా జంపు పసిగట్టిం దేమో, ఆమె వెంటనే తన మొహంపైని ముసుగు వెనక్కు తొలగించి, చిన్నగా నవ్వింది. మొహమంతా దట్టంగా పులిమిన పౌడరు, తెల్లని పలువరస, నిండు బుగ్గలు, పొడుగాటి నాసిక, నాసికాగ్ర స్థానంలో వలయాకారంగా కలుసుకున్న కనుబొమలు, కాటుక దిద్దిన చార దేసి కళ్ళు...... అరమోడ్పు కళ్ళతో నన్ను కవ్వింపుగా చూస్తోంది. ఆ కళ్ళలోని నిషా, నా మత్తును ద్విగుణీకృత పరచింది. అమాంతంగా రిక్షా ఎక్కి కూచున్నాను.

పరదావేసి, "చలో" అన్నది. రిక్షా కదిలింది.

రిక్షాలోపల అంతా చీకటిగా వుంది. ఆ మనిషి నాకు వెచ్చగా తగులుతోంది. నా ఎడం చేతిని ఆమె వీపు మీదుగా వేసి, దగ్గరికి లాక్కు న్నాను. కుడిచేత్తో ఆమె బుగ్గలు నొక్కుతూ, పెదాలను ముద్దు పెట్టుకో బోయాను. మెల్లిగా నా చేతిని దూరంగా తొలగిస్తూ, "తొందర పడకండి" అన్నది గుసగుసగా. నేను సర్దుకుని కూచున్నాను.

"నీ పేరేమిటి?" గుస గుసగానే అడిగాను.

"షరీఫా."

'షరీఫా' అంటే కులీనురాలు. షరీఫా అంటే సీతాఫలం కూడాను.

పది నిమిషాల్లో, కొన్ని మలుపులు తిరిగి, రిక్షా ఆగింది. పరదా తొలగించి, "దిగండి" అన్నాడు రిక్షావాడు. నేను దిగాను. నా వెనకాలే షరీఫా దిగింది.

చుట్టూ కలయ చూశాను. అదొక చిన్న సందు. నిర్మానుష్యంగా వుంది. అక్కడికి నేనెప్పుడూ వచ్చినట్టుగా లేదు.

షరీఫా ఒక గుమ్మం దగ్గర నిలుచుని కట కట లాడిస్తోంది. కొద్ది క్షణాల తర్వాత తలుపు తెరుచుకుంది. ఆమె వెనక్కి తిరిగి, నా చెయ్యి పుచ్చుకుని, లోపలికి తీసికెళ్ళింది. తలుపులు మూసి, గడియ వేసేసింది.

చిన్న గది. ఒక మూల గూటిలో ఒక చిన్న దీపం గుడ్డిగుడ్డిగా వెలుగుతోంది. గది మధ్యలో ఒక నవారు మంచం వేసి వుంది. దానిమీద మాసిపోయిన దుప్పటి పరిచి వుంది. రెండు దిండ్లు వేసి వున్నాయి. మంచం వెనకాల ఒక పరదా కట్టి వుంది. గదిలో మరెవ్వరూ లేరు.

షరీఫా నన్ను తీసికెళ్ళి మంచం మీద కూచో బెట్టింది. తాను గబగబా బురఖా తీసేసి కొలిక్కి తగిలించింది. నింపాదిగా చీరా, బ్లౌజు కూడా విప్పేసి దానిమీదే పడేసింది. లంగా, పెట్టికోట్‌లో వొచ్చి నా ప్రక్కనే, నన్నానుకుని కూచుంది. చేతులెత్తి జుత్తు ముడి విప్పుకుంది. గుబురుగా పెరిగిన పొడుగాటి కురులు వీపునంతా ఆక్రమించుకున్నాయి... ఆ మసక చీకట్లో, నల్లని కురుల మధ్య, ఆమె నవమోహన సుందరిలా కనిపించింది నాకు. పెట్టీ కోట్‌లోంచి పొడుచు కొస్తూన్న నిండురొమ్ములు నన్ను అమితంగా ఆకర్షించాయి. ఆత్రంగా హుక్కు తీశాను. రెండు నిండు బంతులు బైటపడ్డాయి. నేను ఆశ్చర్యంగా వాటినే చూస్తూవుండిపోయాను. అంత పెద్ద రొమ్ముల్ని నేనెప్పుడూ చూళ్ళేదు . వణికే చేత్తో ఒకదాన్ని అందుకుని, నెమ్మదిగా వొత్తుతూ, ముచ్చికను ముద్దాడపోయాను. చివ్వున పాలధారలు నా మొహం మీదికి చిమ్మాయి. నేను వెనక్కి తగ్గాను.

"అరేరే..." అంటూ, షరీఫా తన అరచేత్తో నా మొహాన్ని తుడిచింది.

అంతలో వెనకనించి కేర్ మన్న చిన్న పాపకేక వినిపించింది. నేను ఉలిక్కిపడి లేచి నిల్చున్నాను. షరీఫా పరదాకేసి కోపంగా చూసింది. "చూ చూ చూ" అంటూ ఎవరో చిచ్చి కొడుతున్నారు. కాని ఏడుపు మరీ ఎక్కువైంది.

షరీఫా నావేపు ఒకసారి దీనంగా చూసి, "ఒక్క నిమిషం" అంటూ "సకీనా! ఇటులే" అన్నది.

పరదా తొలగించుకుని ఒక ఏడెనిమిదేళ్ళ అమ్మాయి వొచ్చింది. చంకలో సంవత్సరం నిండని కుర్రాడున్నాడు. గుక్కతిప్పుకోకుండా ఏడుస్తున్నాడు. షరీఫా గబుక్కున వాణ్ణి అందుకుని, వొళ్ళో పడుకో బెట్టుకుని, నేను ఇందాక స్పృశించిన రొమ్మునే వాడి నోట్లో కుక్కింది. వాడు చప్పున ఏడుపు ఆపి, ఆవురావురున ఊకటం మొదలెట్టాడు. షరీఫా తృప్తిగా కొడుకు కళ్ళలోకి చూస్తూ, వాడి ముంగురులు సవరిస్తూ, నాకేసి క్రీగంట చూసింది.

ఆ తల్లికొడుకుల అనుబంధాన్ని చూసి నా కళ్ళు చెమ్మగిల్లాయి. నా మత్తు మటు మాయమైంది. నేను గిరుక్కున వెనుతిరిగాను.

షరిఫా గాబరగా "ఆగండి" అంటూ అరిచి, లేచి, పిల్లవాణ్ణి పిల్ల కిచ్చేసి, నా చెయ్యి పట్టుకుంది. పిల్లవాడు మళ్ళీ ఏడుపు అందుకున్నాడు. నేను నా ప్యాంటు జేబులో వున్న నోట్లన్నీ తీసి, ఆమె చేతిలో పెట్టేసి, గడియ తీసుకుని బైట పడ్డాను.

కొంచం దూరాన, రిక్షాలో కూచుని వున్న రిక్షావాడు, నన్ను చూడ గానే గభాలున దూకి, ఆదుర్దాగా, "ఏమైంది సాబ్! ఏమైంది ?" అంటూ నాకు అడ్డంగా వచ్చాడు.

నేను ఆగిపోయాను.

వెనకనించి, "గూలాం!!" అన్న గర్జన వినపడ్డది.

తిరిగి చూశాను.

గుమ్మంలో నిలుచుని వున్నది షరీఫా. విరబోసిన జుత్తూ, ఆచ్ఛాదన లేని బొమ్మలా .. అపరకాళిలా వుంది. చేతిలో నేనిచ్చిన నోట్లు అలాగే వున్నాయి. కళ్ళెర్రజేసి, నన్ను నమిలి మింగేట్టు చూస్తూ, “గులాం! ఈ డబ్బు ఆయన మొహాన కొట్టేయ్. మనకు భిక్ష అక్కర్లేదని చెప్పు” అంటోంది,

నేను మొహం తిప్పేసుకున్నాను.

రిక్షావాడు అయోమయంగా నన్నూ, షరీఫానూ మార్చి మార్చి చూస్తున్నాడు. నా చేతులు పట్టుకుని, బ్రతిమాలుతున్నట్టుగా అన్నాడు, “పదండి సాబ్ ! లోపలికి పదండి... నా భార్య వొట్టి మొండిముండ... నేను చెబుతాను పదండి......”

నేను చకితుణ్ణయాను !...భార్యా...?... షరీఫా ఆ రిక్షావాడి భార్యా......?

కొద్ది క్షణాలకు తేరుకుని, “చూడు గులాం ! నేనా డబ్బు మీ ఆవిడకు కాదు, మీ కొడుక్కి కానుకగా ఇచ్చానని చెప్పు” అంటూ, చేతులు విడిపించుకుని గబగబా వచ్చేశాను.

(అముద్రితం)